


రేత్రి పొద్దోయొచ్చాడో యెమో, యెంకన్నకు బాగా నిదరొచ్చింది. తెల్లారి, కూతురు రామొచ్చి నిదరలేపితేగాని మెలకవ రాలేదు. 'ఏందిది ? అందరూ సంబరానికెల్తుంటే, యిదేం పోద్దాం !' అంటూ నరిసొచ్చింది. ఎటయితేనేం, లెగవక తప్పింది కాదు.

మొగం కడుగుతున్నా అదే ద్యాస, సానం సేస్తున్నా అదే ద్యాస—'ఏందబ్బా ! ఎట్లా ఆ యెంకటరామయ్యగోరికి పదేనురూపాయ లియ్యటం ? ఈయే డొత్తాయనుకున్న ఆ కూసిని గింజల్లోనూ సగం దేవు డెత్తుకపోతే, మిగతాది ఆసామీ, సర్కారోరూ పంసుకున్నారు. ఏడ సచ్చేదంటా !'

ఏంసెయ్యాలో తోసక ఆ లోసిస్తూనే యెంకన్న మొగం కడిగాడు; సానం సేశాడు, నరిసి 'అయ్యకు కుంక మెట్టవే' అని రామిని పంపింది. రామి నిలువుబొట్టు దిద్దింది అయ్యకు; 'బలే బాగున్నా వయ్యోయ్ !- అమ్మోయ్ ! సూలే, నాన్నే- తిరపతెంకటేశ్వర్లే !' అని సప్పటు సరిసింది.

'సాల్లే. వాగ కూరుకో' అని నరిసి గసిరింది.

'కాదే, అమ్మా ! తిరపతయ్యోరూ డబ్బు కాజేస్తాడు; మరి, నాన్నా డబ్బు కాజేత్తాడు. ఇద్దరూ వొకటేగా ! సూడు, మరి, ఆబొట్టు...' రామి నవ్వింది. నరిసి కొట్టవోయింది.

'ఓ సూరుకోవే. సిన్నదానికి మా తెలివుండదే. అది సత్తెంసెబితే కొడతావెందుకంట?'

'నీకూ అదే దురుబుద్దా ? దేవున్నంటే కళ్లోవూ ?'

'అనకుండుంటే మన కొరిగిందిప్పటికి !'

'శా ! ఏందది? ఎంకటేశ్వర్లని నమ్మకపోతే యింకెర్ని నమ్మేది ? ఎంకటరామయ్యని నమ్ముకుంటారా, పోలిసెట్టిని నమ్ముకుంటారా ?'

'ఎర్ని నమ్మితా మనకు సొడ్డే !'

'సాలు, సాల్లే. ఇకూరుకో; ఏరన్నా యింటే నవ్వరూ !'

నరిసి గొబ్బరికాయ, అంటిపళ్లు, అత్తిరికప్పూరం బయిటికి తీసింది. రామి కళ్లు జిగేల్ మన్నాయి; నోరూరింది.

'ఎంతెట్టి కొన్నావు ? నిన్న తెచ్చిన అద్దరూపాయి యీడకయిపోయింది గందా ! బాగుంది సంబరం ! రేత్తిరల్లా పస్తేగా?'

'ఏందీ రద్ది ? దేవుడికిచ్చింది ఏరన్నా సకుర్కుంటారా ?'

'ఎర్రిమొగవాఁ ! పోయే. ఇలుతే, నా కాకలేస్తోందది.'

'ఏందమ్మోయ్ ! ఏందీ ఆగడం ? పద, పద. రాకరాక మన అదురుస్టం యియ్యాల పండితే, ఏం సేదంట ?'

'లే, అయ్యా ! గుల్లోకెల్దాం' అని రామి, నాన్నను సెయ్యట్టుకు లేపింది.

పి. దుర్గా నాగేశ్వరరావు

ఎంకడు ఆలోసిత్తానే నడుత్తున్నాడు. 'పదేను రూపాయలు ! యాడినుంచి తెచ్చేది? ఇయాల్తో బతుకు బయటడుతుంది', గొణుక్కున్నాడు.

రామి గంతులేత్తోంది. సాలామంది బజన సేసుకుంటూ సాగిపోతూండారు. ఇంత పెద్ద సంబరం గూడెంలో యియాల్టివరకు ఏడజరిగింది! అందరూ వొళ్లుమరిసి, తందనాలు తొక్కుతుండారు. ఇన్నాల్టికి, కాలం మారిపోయింది కావట్టి, మాలోళ్లను గుళ్లోకెల్లడానికి అయ్యోర్లొప్పుకుంటే, సంబరం కాక యింకేంటంట ?'

గుళ్లో గంటలు యినపడుతున్నాయి. రామి మొగిరిగంతులేసి, సప్పట్లు సరిసింది: 'అయ్యోయ్! గుడి ! గుడి ! గంటలు సూడు !– గణగణగణగణ మంటుండాయి...గణగణగణగణ...'

ఏడసూసినా 'అరోం అరగర'...'అరోం అరగర'...'మాదేవసెంబో'...గూడెం గూడెం వొచ్చి గుళ్లో యీనింది.

ఎర్రటోపీలోళ్లూ, తెల్లటోపీలోళ్లూ తెగ తిరుగుతుండారు. పిలకలసలు లేవనేసెప్పొచ్చు. మంగలోళ్ళకేం పెదరోగంవొచ్చిందో, బాజాలు వాయించరంట !–'ఏం? మేం మాతరం మడుసులం కావూ?'...తప్పెట్లు తెగ మోగుతుండాయి. ఏరి మొగానసూసినా కుంకంబొట్టు,యీబూతి రేకలు, పూలదండలు 'అరిదాసులు!' 'అరిదాసులు!'గాలికి దొజస్తంబం గంటలు గణగణ మంటుండాయి; యియాల్టికి తప్పెట్లతో తాళమేస్తుండయ్యి!

ఎంకడు, అదే ఆలోశన–'పదేను రూపాయలు...'

'ఏందిది? దేవుడు గుళ్లోకూడా ఆలోశన!... సాల్లే, పద. దేవుడికి దండవెట్టు' అని నరిసి అరిసింది, ఎంకడు దండవెట్టాడు.

పూజారి అయ్యోరు లేడు కావట్టి తెచ్చిన నయేద్యమంతా తెచ్చినోళ్లకే మిగిలింది. లేకపోతే సగంపైగా వొడుక్కునే వోడు!

రామి అదేపనిగా గొబ్బరిసిప్ప కావాలంటోంది; అమ్మ కొంచెంగిల్లి సేతిలోపెట్టింది; యింకా కావాలంటే అమ్మ కూకలేసింది. అంటి పండు పండుకుపండూ తింది, పోతుకుమల్లే.

'సివరికి మిగిలిందో గొబ్బరికాయ! పదపద. ఎంకటరామయ్య గోరికి పదిహేను రూపాయలివ్వాలి, యియ్యాల దమ్మిడినేదు; పో, నీ దేవుణ్ణియ్యమనవే పిల్లా' అని అరిచాడు యెంకన్న.

నరిసి దిగులుగా సూసింది. 'దేవుడే యిత్తాడులే పద. గుళ్లో ఏందింది? ఎప్పుడూ డబ్బదేనే; బత్తినేదు, హుఁ!'

'బత్తేందే! డబ్బునేంది, బత్తేడి క్కావాలి? సర్కారోడు యిట్టాంటివి సేత్తే ఏడికి నిండిందే? డబ్బు దండక్కాకపోతే. నోరు కట్టడాలంటే నోటికింత యాదన్నా యియ్యమను.'

'అయ్యో! ఏంది గోల. ఏరన్నాయింటే జైల్లోకి తోత్తారు! ఇప్పుడు తెల్లటోపీలు, ఎర్రటోపీలూ కలిసాయంట నారాత! వొసే రామీ! అయ్యకు మతోతోందే!'

'పోయిందే, పిల్లా, పోయింది. లేకపోతే ఏందిదంతా మతోకపోతే! ఇంతఖర్చు ఊళ్లో పెడితే - ఆ కాలవకి నీళ్లొక్కేవి. లేకపోతే ఆ మురుగ్గుంట బాగడేది. లేకపోతే వో సిన్నాసుపత్రెలిసేది. యాందిప్పుడు? అద్దరూపాయసిలుం వదిలింది! ఈమూలో గణాశారి, ఆమూలో గణాశారి! తెల్లటోపీలు ఎర్రటోపీలు సరీకు!– సాలు సాల్లే.'

'నాయనో! యియాలమన్ని సుకంగింటి కెల్లనిచ్చేట్టు లేడురో దేవుడో! ఏందిది సర్కారోళ్లని తిడితే—'

ఎంకడు యింకా కోపంగా అరిశాడు: 'తిడతాను, ఇంకా తిడతాను... ఇయాల దేవుడు గుళ్లోలేడే, పిల్లా,గూడెంలోవుండాడు. అడుగో సూడు. యీడ మాత్రం, ఆతెల్లటోపి, ఎర్రటోపీ! ... మొక్కు, మొక్కయే, పిల్లా !'

'నారాత! ఇయాల సావొచ్చింది రా బగమంతుడా!...'నరిసి ఏడుస్తూ, ఎంకణ్ణి సెయ్యట్టుకు లాక్కెల్లింది.

ఎంకడు ఆలోసిస్తున్నాడు; 'పదేను రూపాయలు! ఎంకటరామయ్య యియాల జైలుకంపిత్తాడు. గుళ్లో కెల్లడం కాదే పిల్లా, యియాల, జైలు కెల్లాలి....నాయం బగవంతుడు సూత్తుండాడు! ఎంకటేశ్వర్లకింకో మొక్కు మొక్కు!'

'నీకు బత్తేడేడిసింది? వోట్ బగవంతుణ్ణట్టుకు తిట్టిపోత్తుండావాయె పాపం పండదూ?'

'బాగా పండింది, మనం సేసుగున్న పాపం! లేకపోతే గుళ్లో కెల్లండని సెప్పకపోతే ఇంత

తినేందుకు యీలుగా ముందేమన్నా సెయ్య రాదూ? తిండుంటే భక్తి! లేకపోతే ఎందుకు, దేవుడు, తెగ్గొరగడానికి తప్ప—ఇదంతా ఆడి పన్నాగమేనే, మన నోళ్లు కట్టేసేందుకు యిదో యెత్తు ఎత్తాడు. గుళ్లోకెళ్లడం యెప్పుడోప్పుడు సెయ్యొచ్చు. గుళ్లోకెళ్లడం యేమంతగనకారం? కాగూడెం బాగుసేయించవను తెలుస్తది! థు...'

ఆళ్ళట్టా నడిసి పోతుండారు.

గతుకులు గతుకులుగా ఉండది, బురద బురదగా ఉండది, రోడ్డు; లగెత్తుతోంది - సెర్లోంచి తాగడానికి నీళ్లు తెత్తోంది, సిన్నది; యెనక పడి పోతోంది. ఓమూల గేదెల్ని కడుగుతుండాడు, కుర్రోడు; ఆడి యీలపాట యినిపించడం తగ్గి పోతోంది. యేరో పిల్ల, బట్టలుతుక్కుంటుండది; దాని ఉస్సో యిస్సో నూతిలోంసి యినపడు తున్నట్టుండది.

గుళ్లో గంటలు మాత్తరం గణ గణ గణ మంటుండాయి; తప్పెట్లు దనదనమంటుండాయి.

ఆళ్లు నడిసి పోతుండారు. ఆ యిసురులో బురద సిమ్ముతోంది; ఈగలు ముసురుతుండాయి; దోవలు రుయ్యి వంటుండాయి.

గుడి గంటలు గణ గణ మంటుండాయి.

ఆళ్లు నడిసిపోయారు.

ఎదురుగుండా పూరి గుడిసె యీయ్యాల పణ్ణా, రేపణ్ణా అని ఎదురుసూస్తోంది.

నరిసి కళ్లు బిక్కు బిక్కు మన్నాయి ... సేతిలో గొబరిసిప్పలు యింతనోరు సేసుకుని పళ్లికిలిత్తున్నాయి.

# గాలం లేని కాలం

పో. శా.

కాలం చేపకు గాలంలేదు
నీలో బాధకు కాలమ్మొక యెర-

విప్లవ ముమిసే నెత్తుట్లో
జీవిస్తూ బలిపిం దింతట్లో
మనుగడ ఫలితంకోసం
నిన్నే బలిగొంటుం దోయీ... మోసం
హృదయకధిత సుఖ మాశిస్తూ
కంట వత్తివేసుకొని చూస్తూ
భవిష్యత్తులోకి మెడచాస్తూ
మహాపత్తువేపు అడుగేస్తూ,
ఎన్నాళ్లిట్లా జీవిస్తావ్ ?

కలలో కనిపించిన ధనరాసులు తూచుట
ఇలలో అన్యాయపు త్రాసులు

సత్యము కొండలనునుపు
అహింస ఎడారినీరు
ప్రేమ మ్మొక నేతిబీర

ఇక ను వ్వాశించే దేమిటి?
ఇక నువ్వు శ్రమించే దెందుకు?

గడుస్తున్న పగళ్లు హృదయంలో సెగళ్లు
గడుస్తున్న రాత్రాళ్ హృదయానికి వేత్రాళ్.

నువ్వు చేసే మంచిని
నేరం ఎదిరిస్తుంది.

నీ యెముకలపిండీ నీ నరాల నెత్తురు
నీ మనస్సు సహనం కాలానికి ఆశనం
కాలంపాదంవద్ద అదుగో నువ్వొతినేముద్ద
ఎవరికోస మీ శ్రద్ధ, ఓ నిరంతరవిశుద్ధ!

నీ మహా మనోయజ్ఞంలో
ఎన్నెన్నో భావమ్ముల సమిధలు
కాలి ; నుసౌతున్నాయి...

నీలో, ఆశకు కాలం ఒకయెర
కాలం చేపకు గాలంలేదు...